గుమ్మిడి సింహాద్రి

సాహసానికి, త్యాగానికి, విజ్ఞానానికి నిలయమైన విక్రమార్కు డొకసారి, తనకు సోదరుడు—మంత్రి అయినటువంటి భట్టితో కలసి దేశసంచారం చేస్తూ తపతీ స్రవంతి దగ్గర సూర్యునకర్ఘ్యమిస్తున్న ఒక భూసురుని చూచాడు. అతని ముఖంలో సరస్వతి తాండవమాడుతూ వుంది.

వా రిరువురు ఆ తేజోమూర్తి యొద్దకు వెళ్లి, "మేము వర్తకులము త్వరలో మేముచేయనున్న ప్రయాణం నిర్విఘ్నంగా సాగి మాకు లాభం చేకూరుతుందా?" అని అడిగారు.

మారువేషాల్లో ఉన్న విక్రమార్కుని భట్టిని ఆ బ్రాహ్మణుడు ఒకసారి తేరిపార చూచి చిరునవ్వు నవ్వాడు. "అయ్యా! ఇప్పుడుమీరు నాతో చెప్పినట్లు వణిజులు కారు. ఇతడు సకల రాజలక్షణాలు కలవాడు. చక్రవర్తి. అద్భుతసాహసి" అని విక్రమార్కుని చూపాడు. భట్టిని చూచి "నీవు ఈ ప్రభువునకు మిత్రుడవు. వర్తకులమని నావద్ద అబద్ధమాడుతున్నారు. ఈ చక్రవర్తి ఉత్తమ క్షత్రియకాంత గర్భమున జన్మించాడు. నీవు వైశ్యకులానికి చెందిన ఒక పరమ సాధ్వీమణి పుత్రుడవు. మీరు నా విద్యను పరీక్షించు తలంపుతో నావద్ద నిజాన్ని మరుగు పరచారు. నేను సత్వగుణ సంపూర్ణుడనైతే నేను చెప్పిన మాటలు పొల్లుకావు." అని చెప్పేసరికి భట్టి విక్రమార్కులు ఆశ్చర్యపోయారు.



## ★ వరాహ మిహిరుడు ★

భట్టి విక్రమార్కులు భక్తిభావముతో ఆయనకు నమస్కరించారు. ఆయన చెప్పిన ప్రతి వాక్యమూ పరమ సత్యమని ఒప్పుకొన్నారు ఆ బ్రాహ్మణుడు వారిని తన గృహానికి తీసుకొనివెళ్లి ఆతిథ్యమిచ్చాడు.

భట్టి విక్రమార్కులకు ఆతిథ్యమిచ్చిన బ్రాహ్మణుని పేరు 'మిహిరుడు.' ఆయన సూర్యభగవానుని అనుగ్రహము వలన జన్మించడం వల్ల ఆయనకా పేరు పెట్టారు. మిహిరుడు తన ఎనిమిదవ ఏటనే వేదములను, జ్యోతిష శాస్త్రమును, నక్షత్ర శాస్త్రమును తండ్రివద్ద నేర్చుకున్నాడు. మిహిరునకిప్పుడు యిరవైఐదు సంవత్సరాలు. ఇంత వరకూ మిహిరుడు చెప్పిన ఏ విషయం కూడ పొల్లుపోలేదు. అతడు చెప్పినట్లు అక్షరాలా జరిగాయి.

ఆతిథ్యము స్వీకరించి భట్టి విక్రమార్కులు "మహాత్మా! మీరు మా కోరికను మన్నించి, మా ఆస్థానాన్ని అలంకరించవలసింద"ని కోరారు. మిహిరాచార్యుడు సంతోషంగా అందుకు అంగీకరించాడు.

### 2

రత్నఖచితమైన సింహాసనమున విక్రమార్కుడు ఆసీనుడైఉన్నాడు. సభాభవనము భట్టి మొదలగు అమాత్యవర్యులతోను, కాళిదాసు ధన్వంతరి, ఘటకర్పుడు, మిహిరుడు వరరుచి మొదలగు నవరత్నములతోనూ శోభాయమానంగా వుంది.

ఆనాడు విక్రమార్కుని పట్టపు దేవి ఒక కుమారుని కన్నది. బాలుని జాతకమును వ్రాయవలసినదిగా విక్రమార్కుడు సభ నలంకరించి ఉన్న దైవజ్ఞులను కోరాడు.

కాళిదాసు వరరుచిగూడ జ్యోతిషములో నిపుణులు. వారు "యువరాజు తన పద్ధెనిమిదవ ఏట వేటకు పోయి ఆ అడవిలో ఒక క్రూర మృగముచేత మరణించ గల" డని తేల్చి, విక్రమార్కునితో చెప్పారు.

సభ నలంకరించియున్న మిహిరాచార్యుడు లేచి రాజు ముఖము చూచి నిశ్శంకగా "రాజకుమారుడు ఎక్కడ వున్నప్పటికీ, తన పద్ధెనిమిదవ ఏట వరాహ కరాళ దంష్ట్రాల వాతబడి మరణిస్తాడు. ఇతనిని మృత్యు ముఖంనుండి తప్పించడం మానవ సాధ్యంకాదు. మానవుల బుద్ధి కుశలత కాని, మణి మంత్రౌషధములు కాని రాజకుమారుని ఈ గండమునుండి కాపాడలే"వని చెప్పి తన స్థానంలో కూర్చున్నాడు.

విక్రమార్కుడు భట్టి మొదలైన మంత్రులతో చాలావరకు చర్చలు సాగించి రాజకుమారుని రక్షించుకోవడానికి ఒక బ్రహ్మాండమైన భవనం కట్టించాడు. దాని మధ్యలో ఏడంతస్తుల ఒంటి స్తంభంమేడకట్టి, ఏడవ అంతస్తులో రాజకుమారుడు వుండే ఏర్పాట్లు చేశారు. మహారాజు అనుమతి లేనిదే రాజకుమారుడు బయటకు వెళ్లటానికి వీలులేదని ఆజ్ఞాపించారు. రాజకుమారుడు ఆటపాటలతో ఖులాసాగా కాలం గడపటానికి అతని యీడుగల పిల్లలను కొందరిని రాజకుమారుని మందిరంలో ఉంచారు.

ఆ భవనానికి రాత్రింబవళ్లు సాయుధులైన భటులు కావలా కాస్తూ ఉంటారు. 'వారికి తెలియకుండా చీమైనా బయటికి వెళ్లటం కాని, బయటనుండి లోపలికి వెళ్లటం గాని అసంభవం. భవనానికి చుట్టూ లోతైన కందకం వుంది. ఏ మృగము కూడా కందకాన్ని దాటి భవనానికి చేరకుండా తగిన కట్టుదిట్టాలు చేయబడ్డాయి.

ఇదంతా చూస్తున్న ప్రజలలో సంచలనం కలిగింది. "మిహిరాచార్యుడు జ్యోతిషంలో ఎంతటి దిట్ట అయినప్పటికీ, యీసారి మాత్రం నిండు కొలువులో అవమానితుడు కాక తప్పదు" అని అనేకవిధాలుగా మాట్లాడుకుంటున్నారు.

### 3

నాటితో రాజకుమారునకు పద్ధెనిమిది సంవత్సరాలూ పూర్తి అవుతాయి. రాజ్యంలో ప్రతిచోట "మిహిరాచార్యునికి ఓటమి తప్ప" దను మాటలే.

విక్రమార్కుడు ఆనాడు పెందలకడే సభతీర్చి ఉన్నాడు. మిహిరాచార్యుని చూచి "మీరు ఈనాడు ఇరవైఏడు గడియలకు రాజకుమారుడు మరణిస్తాడని చెప్పారు. ఈ విషయంలో మాత్రం మీజ్యోతిషం ఫలించదేమో! అని నా అనుమానం. నా కుమారుని వరాహం బారినుండి తప్పించటానికి నేను చేయించిన కట్టుదిట్టాలు దుర్భేద్యమైనవి. ఇన్ని రక్షణ లున్నప్పటికీ రాజకుమారుడు మరణిస్తే, మీ జ్యోతిష జ్ఞానానికి వరాహ చిహ్నమైన యీ రాజముద్రికను బహూకరిస్తాను." అని అన్నాడు.

మిహిరాచార్యుడు లేచి "మహారాజా! మీరు కుమారుని రక్షించటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా, అవి మానవ నిర్మితాలే కాని వేరు కావు. దైవ ప్రేరేపిత వాక్కులు ఎప్పుడూ పొల్లుపోవు. నాకు రాజ

కుమారుని పైన ఏమాత్రం ద్వేషం లేదు. ఒకవేళ నా జ్యోతిషం ప్రకారము జరుగక రాజకుమారుడు జీవిస్తే నాకంటే ఎక్కువగా సంతోషించే వారుండరు. అప్పుడా రాజకుమారుని దీవించి, నాఓటమినిఅంగీకరించి అడవులకు పోయి తపస్సు చేసుకుంటా"నని శపథంచేశాడు.

విక్రమార్కుడు మిహిరాచార్యుని శపథానికి చింతించి "మహాత్మా! మీరు మీ శపథాన్ని ఉపసంహరించుకోండి. దైవ మిచ్చిన ఆయుర్దాయం ఎంతవరకుంటుందో అంతవరకూ మానవుడు బ్రతుకుతాడు. నా కుమారునిగూర్చి నాకు చింత లేదు. ఒకవేళ ఈ గండం గడిచి నా కుమారుడు బ్రతికి నప్పటికి నేను మీవంటి దైవజ్ఞులను కోల్పోటానికి ఇష్టపడను. మీరు నా ఆస్థానం విడిచిన మరుక్షణమే, నేనుగూడ ఈ రాజ్యాన్ని త్యజించి మీ వెనుక వస్తాను." అని అన్నాడు. అప్పటికి సభచాలించి, తిరిగి ఇరవై గడియలు గడచిన తరువాత అందరూ సమావేశమయ్యారు.

గడియ గడియకూ రాజభటులు రాజకుమారుని క్షేమవార్తలు సభామందిరానికి అందజేస్తూ ఉన్నారు ఇరవై ఏడు గడియలు పూర్తి అయ్యాయి. మిహిరాచార్యుడు లేచి "మహారాజా! కుమారుడు మృతి చెందాడు. ఇక మనం ఆయన మృతకళేబరమున్న చోటికి బయలుదేరవచ్చు" అని చెప్పాడు.

అంతలో ఒక సేనాని పరుగెత్తుకొని వచ్చి "రాజకుమారుడు క్షేమముగా ఉన్నా"డని చెప్పాడు. మరి కొంతదూరం వెళ్లేటప్పటికి ఇంకొక సేనాని అదేవిధంగా చెప్పాడు.

అందరూ సౌధం చేరుకున్నారు. ఏడవ అంతస్తు తలుపులు తట్టారు. తలుపులు తెరవబడ్డాయి. కాని అక్కడ రాజకుమారుడు లేడు. అక్కడున్న వారినడిగితే "రాజకుమారుడు యింతసేపూ మాతో చదరంగమాడి యింతకు మునుపే బడలికగా ఉందని పైకి వెళ్ళాడు. క్షేమంగానే ఉన్నా"డని చెప్పారు.

మిహిరాచార్యుడు విక్రమార్కుని చూచి "రాజకుమారుడు ఇరవై ఏడు గడియలకే చనిపోయాడు. పైకి వెళ్దాం పదండని" చెప్పాడు.

అందరూ పైకి వెళ్లారు. విక్రమార్కుడు వణకుతున్న చేతులతో తలుపుతెరచాడు. లోపలిదృశ్యాన్ని చూచి అందరూ నిర్విణ్ణులైనారు. రాజకుమారుడు రక్తంలో తడిసి మంచంమీద పడివున్నాడు. అతడి గుండెలమీదఉన్న వరాహం వాడి కోరలు రాజకుమారుని గుండెల్లో దిగబడి ఉన్నాయి.

రాజకుమారుడు చనిపోయిన మంచం దగ్గర ఒక ధ్వజముంది. దానిమీద లోహంతో చేయబడిన ఒక వరాహముంది. రాజచిహ్నమైన అటువంటి ధ్వజములు రాజప్రాసాదాల పైన ఉండటం రివాజు.

రాజకుమారుని రక్షణకు ఇన్ని ఏర్పాట్లు చేసినా ఆ లోహ వరాహాన్ని ఎవరూ గుర్తించలేదు. బడలికగా ఉన్న రాజకుమారుడు సరిగా ధ్వజము క్రిందనున్న మంచంమీద నిద్రపోయాడు. గాలి తాకిడికి ఆ వరాహము ధ్వజము నుండి జారి రాజకుమారుని మీద పడింది. దాని వాడికోరలు గుండెలలో నాటుకొనడంవల్ల రాజకుమారుడు వెంటనే మరణించాడు. ఈ విషయం తెలియని భటులు రాజకుమారుడు క్షేమంగా ఉన్నట్లు చెబుతూ వచ్చారు.

విక్రమార్కుడు మిహిరాచార్యుని ఆలింగనం చేసుకొని తన వాగ్దానం ప్రకారం వరాహచిహ్నమున్న రాజముద్రికను బహూకరించాడు.


నాటినుండి మిహిరాచార్యుడు "వరాహ మిహిరు" డయ్యాడు. ★


మీ బిడ్డ...

1, 3 సంవత్సరముల మధ్య, శాకాహారులైన మగ బిడ్డలలో, లివర్ వ్యాధులు సామాన్యమని, మా లెక్కలవల్ల తెలుచున్నది.

తరుచుగ అజీర్ణ వ్యాధులు, కడుపు ఉబ్బరము, చికాకు పడుట, కోపము, ఆకలి మందగించుట మొదలైన గుణములు లివర్ వ్యాధిని సూచించు లక్షణములు.

సకాలంలో జమ్మివారిని సలహా చేయండి.




JVZ-13 TE

బిడ్డల లివర్ & స్ప్లీను వ్యాధులకు

జమ్మిస్

లివర్‌క్యూర్

జమ్మి వెంకటరమణయ్య & సన్స్
జమ్మి బిల్డింగ్స్, మైలాపూర్, మద్రాసు-4.

బ్రాంచిలు: గుండా కృష్ణమూర్తి బిల్డింగ్, 329, నాగేశ్వరరావు పంతులు రోడ్, గాంధీనగరం పోస్టు, విజయవాడ; ఒరుగంటివారి వీధి, విజయనగరం సిటీ.